## పేలుడు ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 26 : కొత్తవాడలో పేలుడు ఘటనకు కారకులను పోలీసులు గుర్తించారు. ఈ పేలుడు బ్లాక్ మ్యాజిక్ కారణంగా జరిగిందని నిర్ధారణకు వచ్చి అందుకు గల కారకులపై కేసు నమోదు చేశారు. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. కుమారస్వామి అనే వ్యక్తికి చెందిన ఇంటి నిర్వహణ బాధ్యత మాచర్ల రాజేశ్ చూసుకుంటున్నాడు. అదే ఇంటిలో గతంలో అద్దెకు ఉన్న యాకూబ్‌పాషా ఇల్లు ఖాళీ చేసి, తనకు పరిచయమున్న బాదావత్ వెంకన్నకు దాన్ని అద్దెకు ఇప్పించాడు. మంగళవారం రాత్రి దుష్టశక్తులు దరిచేరకుండా ఉండడానికి యంత్రాన్ని తయారు చేసి ఇస్తామని నమ్మబలికి విచిత్ర ఆకృతిలో ఉన్న నాణెంపై రసాయనాలు పోసి క్షుద్రపూజలు చేసినట్లు నటించి, దాన్ని ప్రత్యేకంగా ప్యాక్ చేసి రాజేశ్‌కు యాకుబ్‌పాషా, వెంకన్న అందించారు. ఈ నాణెం ఇంట్లో ఉంటే మంచి జరుగుతుందని నమ్మబలికారు. వారి మాటను నమ్మిన రాజేశ్ దాన్ని ఇంట్లో భద్రపరిచాడు. అయితే, ఒక్కసారిగా నాణెం ప్యాక్ చేసిన బాక్స్ పేలి పెద్ద శబ్దం రావడంతో కంగారుపడిన రాజేశ్ వారిని వెతకగా కనిపించకుండా పోయారు. ఈ మేరకు పోలీసులకు రాజేశ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

## ఉరేసుకొని అగ్రికల్చర్ విద్యార్థిని ఆత్మహత్య

రేష్మిత(ఫైల్)

కాశీబుగ్గ, ఫిబ్రవరి 26 : నగరంలోని పైడిపల్లి ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కళాశాల లో ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎనుమాముల సీఐ అలె రాఘవేందర్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన గుంటోజు రేష్మిత(19) ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. బుధవారం ఉదయం తాను ఉంటున్న గది తలుపు తీయకపోవడంతో కాలేజీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా రేష్మిత ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉంది. రాత్రి గదిలో ఆమె ఒంటరిగానే ఉంది. ఇక్కడ చదువుకోవడం ఇష్టం లేదని తెలిసింది. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పాము కాటుతో చిన్నారి మృతి

చిట్యాల, ఫిబ్రవరి 26 : పాము కాటుకు గురై ఓ చిన్నారి మృతిచెందింది. భూపాలపల్లి చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన కిన్నెర శిరీష – రాజు దంపతులకు కుమారుడు, కుమార్తె కిన్నెర కీర్తన(7) ఉన్నారు. కుటుంబ సమేతంగా ఇంట్లో మంగళవారం రాత్రి కింద నిద్రిస్తుండగా కీర్తన చేతిని పాము కాటు వేసింది. హుటాహుటిన చిట్యాల సివిల్ దవాఖానకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు భూపాలపల్లి దవాఖాన అక్కడి నుంచి ఎంజీఎం దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారు జామున చిన్నారి మృతి చెందింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పర్వతగిరి : పర్వతాల శివాలయంలో పూజలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నర్సంపేట : మాదన్నపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సంగెం : సంగమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన మంచు లింగం

# కనుల పండువగా మహాశివరాత్రి ఉత్సవాలు

- ఆలయాలకు బారులు తీరిన భక్తులు
- శివనామ స్మరణతో మార్మోగిన వీధులు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పూజలు చేశారు. కాశీబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వర రంగనాథస్వామి, శ్రీభక్తమార్కండేయ దేవాలయంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ నిర్మలా గీతాంబ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సాయికుమార్, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగెంలోని సంగమేశ్వరాలయంతోపాటు పర్వతగిరిలోని పర్వతాల శివాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, నర్సంపేట మండలం మాదన్నపేట చెరువు కట్టపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లిలోని శివాలయంలో కూడా పెద్ది పూజలు చేశారు. ఖిలావరంగల్ కోటలో శంభులింగేశ్వరుడికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అభిషేకం చేశారు. అలాగే, జిల్లాల్లోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయంలో దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

నల్లబెల్లిలో డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

## గ్రామాల్లో సుందరీకరణ పనులు షురూ..

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- అధికారులపై కలెక్టర్‌తోపాటు డీఆర్‌డీవో ఆగ్రహం
- యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న అభివృద్ధి పనులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 26 : మండల వ్యాప్తంగా అధికారులు గ్రామాల సుందరీకరణ పనులు మొదలుపెట్టారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గ్రామాల్లో ఎక్కడా పచ్చదనం, పరిశుభ్రత పనులు చేపట్టకపోవడం, డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. అలాగే, ఏపుగా ఎదిగిన పల్లెప్రకృతి వనాలను పట్టించుకోకపోవడంతో అవి ఎండిపోయి కళావిహీనంగా మారుతున్నాయి. మిషన్ భగీరథ నీటిని కూడా అందించకపోవడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'పంచాయతీల పాలన అస్తవ్యస్తం' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 24న కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ సత్యశారదతోపాటు డీఆర్‌డీవో కౌసల్య స్పందించారు. మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే గ్రామాల అభివృద్ధి, సుందరీకరణ, పచ్చదనం పరిశుభ్రతపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. దీంతో ఎంపీడీవో నర్సింహమూర్తి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించారు. ప్రకృతి వనాలతో పాటు గ్రామాలకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందించేలా చర్యలు చేపట్టారు. మిషన్ భగరథ డీఈ అజార్‌తయాద్, ఏఈ సాయిరాం స్పందించి, కన్నారావుపేటతోపాటు అనేక గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో మల్టీపర్పస్ వర్కర్లు ప్రతి డ్రైనేజీని శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అంతేకాక రామతీర్థం గ్రామంతోపాటు నిరుపయోగంగా మారిన అన్ని డంపింగ్ యార్డులను వినియోగంలోకి తెచ్చి, ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్తను సేకరించి వర్మీ కంపోస్ట్ తయారీకి శ్రీకారం చుడుతున్నారు.

ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

## ద్వారకపేట రహదారిపై మురుగు నీరు

### యూనియన్ బ్యాంక్ ఎదుట పేరుకుపోయిన చెత్త
### పట్టించుకోని నర్సంపేట మున్సిపల్ అధికారులు

నర్సంపేట, ఫిబ్రవరి 26 : పట్టణంలోని ద్వారకపేట ప్రధాన రహదారిపై మురుగు నీరు పారుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ద్వారకపేట రోడ్డు యూనియన్ బ్యాంక్(ఆంధ్రా బ్యాంక్) ఎదుట చెత్తాచెదారం భారీగా పేరుకుపోయింది. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వాహనదారుల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. రోజుల తరబడి రహదారిపై మురుగునీరు ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అలాగే, బ్యాంక్‌కు వచ్చే వినియోగదారులు మురుగు నీరును చూసి ముక్కు మూసుకుంటున్నారు. వాహనాలు ఇదే రహదారిపై వెళ్లడం వల్ల బురద బాటసారులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని పైపులైన్ పగిలి రోజుల తరబడి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నది. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి, రహదారిపై నీరు నిలువకుండా చూడాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీ

- జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, ఫిబ్రవరి 26 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ కేంద్రాన్ని సందర్శించి, సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేశారు. పోలింగ్ సిబ్బందితోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించడానికి పంపిణీ కేంద్రానికి వచ్చిన పీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు, అధికారులకు ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి గురికాకుండా సిబ్బంది పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలన్నారు. చెక్ లిస్టు ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి సరి చూసుకోవాలని సూచించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రిని బూత్‌లకు తీసుకువెళుతున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 2,352 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1474, మహిళలు 878 మంది ఉన్నట్లు తెలిపారు. అలాగే, జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ఉపాధ్యాయ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సాహితీవేత్తలు

జనరల్ బోగి నాటకంలో ఒక సన్నివేశం

## నాటక కళాకారులను ప్రోత్సహించాలి

- కళా ప్రదర్శనలకు ఉచితంగా వేదిక కేటాయించాలి
- ముగిసిన తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 26 : కళావేదికల ద్వారా ప్రదర్శించే నాటికలు, నాటకాలు ప్రజల ఆదరణ పొందటానికి కళాకారులకు తగిన పోత్సాహం అందించాలని రాష్ట్ర కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం అన్నారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహర బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సదానందం మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో మార్పుల నేపథ్యంలో నాటికల ప్రాధాన్యం తగ్గకుండా కళాసంస్థలు, ప్రభుత్వం తగిన చేయూత ఇవ్వాలని కోరారు. కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటులో ఎన్నో వ్యయ ప్రయాసాలకు లోనై అధికారులు, ఇంజినీర్లకు కళాకారులకు కావలసిన సౌకర్యాలు, వేదికను ఏర్పాటు చేయడంలో ఎంతో కృషి చేశామని పేర్కొన్నారు. అయితే, ప్రతినెలా తమ నాటికలు ప్రదర్శించే విధంగా కళా వేదికను ఉచితంగా అందించాలని కోరారు. అలాగే, కళాక్షేత్రంలో మరిన్ని సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాకారుల రిహార్సల్ కోసం ప్రత్యేకంగా ఒక గది, ప్రేక్షకుల కోసం టాయిలెట్స్, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కుందావరుఖుల కృష్ణమూర్తి, బీ పురుషోత్తమరావు, నేలకొండ భాస్కర్‌రావు, వనం లక్ష్మీకాంతారావు, లక్ష్మణ్‌రావు, ఎన్‌వీఎన్ చారి, నాగిల్ల రామశాస్త్రి, అంపశయ్య నవీన్, జూలూరి నాగరాజు, సీత వెంకట్, ఓడపల్లి చక్రపాణి, నృత కళాకారులు, కళాభిమానులు, సాహితీవేత్తలు, కవులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన జనరల్ బోగి నాటకం అందరినీ అలరించింది.

లచ్చమ్మ(ఫైల్)

## శతాధిక వృద్ధురాలి మృతి

ఖానాపురం, ఫిబ్రవరి 26 : మండలంలోని బుధరావుపేట గ్రామంలో శతాధిక వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. గ్రామానికి చెందిన పులిగిళ్ల లచ్చమ్మ(101) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో బుధవారం ఆమె మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు. కాగా, ఇటీవల లచ్చమ్మ 100వ పుట్టిన రోజు వేడుకలను మూడు తరాలు కలిసి ఘనంగా జరుపుకున్నారు.

# టెన్ పర్సంటేజ్ ఇస్తేనే చెక్కు క్లియరెన్స్

- పైసల మంత్రి అనుచరుల 'బీ' ట్యాక్స్ దందా
- పెండింగ్‌లో రూ.30 కోట్ల విలువైన బల్దియా చెక్కులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు

వరంగల్, ఫిబ్రవరి 26 : ఫిక్స్ చేసిన 'టెన్' పర్సంటేజ్ ఇస్తేనే చెక్కులు క్లియర్ అవుతాయి. ఇవ్వకపోతే నెలల తరబడి పెండింగ్‌లో ఉంటాయి. దీంతో పైసల మంత్రి అనుచరులు ఫిక్స్ చేసిన 'బీ ట్యాక్స్' ముట్టజెప్పి బిల్లులు క్లియర్ చేసుకునేందుకు కాంట్రాక్టర్లు హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేందుకు మూడు నెలల కిత్రం రాష్ట్ర ప్రభుత్వం రూ.187కోట్లు విడుదల చేసింది. వాటికి సంబంధించిన చెక్కులకు సెక్రటేరియట్‌లోని రెవెన్యూ శాఖ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. బల్దియా ఇప్పటికే సుమారు రూ.30కోట్ల పెండింగ్ బిల్లులకు చెక్కులు రాశారు. ఆయా చెక్కులను బల్దియా కాంట్రాక్టర్లు వరంగల్ ట్రెజరీలో జమ చేశారు. వాటి క్లియరెన్స్ కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే అక్కడ కాంట్రాక్టర్లకు దిమ్మ తిరిగే పర్సంటేజ్ ఫిక్స్ చేయడంతో లబోదిబోమంటున్నారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రెండేళ్లు పెండింగ్‌లో ఉండడం, ఇప్పుడు బిల్లులు క్లియర్ చేసే సమయంలో పర్సంటేజ్ పేరిట పెద్ద మొత్తంలో దండుకోవడంతో కాంట్రాక్టర్లకు దిక్కుతోచడం లేదు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న బిల్లుల క్లియరెన్స్ కోసం మంత్రి అనుచరులు ఫిక్స్ చేసిన పర్సంటేజ్ చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. పర్సంటేజ్ ముట్టజెప్పకుంటే చెక్కు క్లియర్ చేసే పరిస్థితి లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

**మంత్రి అనుచరుల దందా..**

సెక్రటేరియట్‌లో పైసల మంత్రి అనుచరులు యథేచ్ఛగా బీ ట్యాక్స్ పేరిట పర్సటేంజ్ దందా చేస్తున్నట్లు బల్దియా కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. టెన్ పర్సంటేజ్ ఫిక్స్ చేసి మరి వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ముందు చెల్లిస్తేనే చెక్కు క్లియర్ అవుతుందని బాహాటంగా చెబుతున్నట్లు సమాచారం. అలస్యం చేస్తే పర్సంటేజ్ పెరుగుతుందేమో అన్న భయంతో డబ్బులు ఇచ్చేందుకు కాంట్రాక్టర్లు హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. రెండు సంవత్సరాలుగా గ్రేటర్ కార్పొరేషన్‌లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.187 కోట్లు విడుదల చేసింది. వాటికి సంబంధించిన సుమారు రూ. 30 కోట్ల విలువైన చెక్కుల రెవెన్యూ క్లియరెన్స్ కోసం కమీషన్ చెల్లించాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

**అక్కడ.. ఇక్కడ..**

పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో మామూళ్ల పర్వం జోరుగా సాగుతున్నదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు క్లియరెన్స్ కోసం పెద్ద మొత్తంలో చెల్లించుకోవాల్సి వస్తున్నట్లు తెలుస్తున్నది. చెక్కులు రాసినందుకు బల్దియాలో ఫిక్స్ చేసిన పర్సంటేజ్‌తో పాటు చెక్కు క్లియరెన్స్ కోసం రెవెన్యూ శాఖలో ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో పర్సంటేజ్‌ల డబుల్ ధమాకా నడుస్తున్నది. బల్దియాలో ఉన్నత స్థాయి నుంచి కింది స్థాయి వరకు కలిపి పర్సంటేజ్‌లు ఫిక్స్ చేసినట్లు తెలుస్తున్నది. ఇలా రెండు చోట్ల పర్సంటేజ్‌లు వసూలు చేస్తుండడంపై కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

## సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో బల్దియా బేష్

### 100 నగరాల జాబితాలో 4వ స్థానం

వరంగల్, ఫిబ్రవరి 26 : స్వచ్ఛ సర్వేక్షన్-2024 పోటీల్లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ కేటగిరిలో గ్రేటర్ కార్పొరేషన్ దూసుకుపోతున్నది. 100 నగరాల జాబితాలో బల్దియా ప్రస్తుతం 4వ స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీల్లో తెలంగాణ నుంచి గ్రేటర్ వరంగల్ ముందంజలో ఉంది. మొదటి, రెండు స్థానాల్లో విజయవాడ, విశాఖపట్నం నగరాలు ఉండగా, మూడో స్థానంలో మహారాష్ట్రలోని పింప్రి చించ్వాడ్ నగరం ఉంది. ఇప్పటి వరకు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో 33,833 నగరవాసులు గ్రేటర్ కార్పొరేషన్ అందిస్తున్న సేవలపై సానుకూలంగా తమ అభిప్రాయాలు తెలిపారు. మార్చి మొదటి వారం వరకు సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశం ఉంది.

**ప్రజలు ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనాలి**

స్వచ్ఛ సర్వేక్షన్-2024 పోటీల్లో గ్రేటర్ కార్పొరేషన్ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఎంతో దోహదపడుతుంది. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో నగరవాసులు పాల్గొని గ్రేటర్ అందిస్తున్న సేవలపై స్పందన తెలపాలి. పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొని వరంగల్ నగరం తొలి స్థానంలో ఉండేలా సహకరించాలి.
– మేయర్ గుండు సుధారాణి

**ఇదే స్ఫూర్తి కొనసాగించాలి**

సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో పౌర స్పందన చాలా బాగుంది. నగర ప్రజలు ఇదే స్ఫూర్తి కొనసాగించాలి. ఎక్కువ సంఖ్యలో పాల్గొని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్ వచ్చేలా దోహద పడాలి.
– కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

## 'రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి'

నల్లబెల్లి, ఫిబ్రవరి 26 : బీసీ రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా ఈ నెల 28న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశాన్ని అన్ని వర్గాల బీసీ నేతలు విజయవంతం చేయాలని బీసీ హక్కుల సాధన పోరాట సమితి మండల కన్వీనర్ చీకటి ప్రకాశ్ పిలుపునిచ్చారు. సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొననున్నట్లు తెలిపారు.


జయశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి పెద్ది పరామర్శ

నర్సంపేట, ఫిబ్రవరి 26 : పట్టణంలో మృతురాలి కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. బీజేపీ నేతలు రాణీరుద్రమ, డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తల్లి గోగుల జయశ్రీ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. తొలుత జయశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెళ్లి వెంకటనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, రాయిడి రవీందర్‌రెడ్డి, క్లస్టర్ బాధ్యులు బండి రమేశ్, మండల శ్రీనివాస్, దేవోజు సదానందం, చుక్క అనిల్, రవీందర్, సాంబయ్య, యాదగిరి ఉన్నారు.

కొమురయ్య కుటుంబానికి సరుకులు అందజేస్తున్న ప్రతినిధులు

## మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

రాయపర్తి, ఫిబ్రవరి 26 : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జక్కుల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ మండల నాయకులు కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి నేతృత్వంలో మృతుడి కుటుంబానికి 50 కేజీల బియ్యం, వంట నూనె, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ర